# స్వప్నం



జూకంటి జగన్నాథం

జనవరి నెల రెండో వారం చలి వుండు. చలికి తోడు తెల్లవారు జామున మామిళ్ల పైరగాలి సన్నగా వీస్తోంది. అంతవరకు జ్వరం వచ్చిన చిన్నపిల్ల దిక్కు పడుకున్న భూలక్ష్మి సంటి పిల్లగాడు 'కునకున'మనేసరికి ఇటు పక్కకు తిరిగింది. పక్కనాని పిండేమోనని చేయితోని ముట్టి చూసింది. పచ్చిగా లేదు కానీ పిల్లగాడు గడికోసారి మెసులుతుండు - ఆకలైతుందేమోనని భూలక్ష్మి కొడుకు దగ్గరికి జరిగి రొమ్ము నోటికి అందించింది. పిల్లగాడు తనకు కావాల్సింది అందేసరికి ఇట్టే గుర్తుపట్టి పాలు తాగుతుండు - భూలక్ష్మి పిల్లగాని లేలేత స్పర్శకు నిలువెల్లా వులకించిపోయి ముంత 'ఒడుపు'గా పాలు పడుతుంది.

భూలక్ష్మి వీపు మీద చేయి వేసి మెల్లగా లేపుతున్నట్టు కదిలిస్తూ 'ఏయ్!'' అని పిలిచాడు భూమయ్య.

''ఆ! ఏది సంబుడం. పోరడు పాలు సీకుతుండు. నిన్నియ్యాల రెండు నెల్లు దాట్నయేమో!... ఇగ...'' భూలక్ష్మి మెల్లగానే అన్నా ఆ మాటల వెనక బోలెడు విసుగు, కాసింత కోపం ఉందని భూమయ్య ఇట్టే గ్రహించి ''అదిగా... దె! తెల్లారుతంది. ఇయ్యాల సిరిసిల్లకు పోయి ఆడుకాలకు పాలుపోసి రాంగరాంగా సిన్న పిల్లకు మందులు తెత్తనంటివని లేపిన్నే'' అన్నాడు.

''అది కాదయ్యా! సిన్నపిల్లకు మల్ల నడిరాత్రి అగ్గోలె జెరమచ్చి తల్లడం మల్లడం సేసింది. ఇంతకుముందే జెర్ర జెరంగుంజి పడుకుందో లేదో - నాకు గిట్ల కన్ను మలిగే సరికి సంటోడు లేసిండు. పాలు తాగుతండు. నిద్ర లేక కండ్లు మంటలు మండుతున్నయ్ - పెయ్యి తిరుగుతంది. సిన్న దానికి జెరమేమోగానీ నాకు జెరమచ్చినంత పనైంది'' అని భూలక్ష్మి భర్తతోని రాత్రంత పిల్లగాండ్లతోని 'ఏగిచ్చిన తిప్పలు' చెప్పింది.

భూమయ్య భార్య మాటలకు మొదలు కొంచం బాధపడ్డా - ఆ తరువాత ఇటు వారం రోజుల నుంచి రాత్రి రాత్రి వస్తున్న చిన్నపిల్ల వరున జెరంతోనీ, అటు సంటి పిల్లగాన్ని 'సుదురాయించుడు'తోని భూలక్ష్మి బాధలు గుర్తుకు వచ్చి భూమయ్య 'పాపం! అది మొదటి నుంచి కట్టపు రాతనే అడుక్కచ్చుకుంది. తనను కట్టుకొని ఇద్దరాడ పిల్లలు, ఒక మొగ పోరంతోని, రెండు బర్లపాలతోని, కరెంటు కిందనున్న ఎకరం పొలంతోని మస్తుగ పొర్లాడుతంది - కన్నోని ఇంటినే పూర్తిగ మరిసి కట్టుకున్నోని ఇల్లు పేరుకు తేవాల్నని కాలుకు బట్ట కట్టుకుంట సెయ్యికి యిరాము లేకుంట పనిసేస్తుంది - రేపు మాపైతె నీల్లాడుతదనంగా బంద్ సేసి సంటోడు పుట్టిన రెండు నెల్లు అయిందో లేదో సిరిసిల్ల ఆడుకాలకు

పాలు పొయ్యటానికి ఇయ్యాల్ల నుంచి పోవు డు మల్ల మొదలు - దాన్ని ఏమన్నా అడిపోసుకుంటే నోరు పడిపోద్ది - అని నిప్పుల మీది మక్కకంకోలె వగలు రాత్రి అగోలిస్తనే ఉంది'' అని నొచ్చుకున్నాడు. పిల్లగాండ్లకూ భూలక్ష్మికి 'సెద్దర్లు' సరిగ్గా కప్పాడు.

భూలక్ష్మీ, పిల్లలూ లేస్తరని భూమయ్య 'పాలసర్వ' తీసుకొని అడుగుల అడుగులు ఏసుకుంట ఒక్క రెక్క తలుపు తీసి మళ్ళీ చలిపెడుతుందని దగ్గరికి గుంజి బర్లపాక దగ్గరికి నడిచి 'దుడ్డెల'ను ఇడిసి పెట్టాడు.

భూలక్ష్మికి 'సిరిసిల్లకుపోయి పాలు పొయ్యాల్నని' సంగతి మనసులో మెదిలి నిద్రపోదామన్నా రావడంలేదు. 'తెల్లారు తుంది' అని లేపిన భర్త మీదికి ఉట్టి ఉట్టిగనే గయ్యిన లేసిన్నని భూలక్ష్మి బాధ పడింది. గొడ్డోలె పని సేసుకపోయే ఎడ్డిబా గులోడు - అత్త, మామలు లేరు - ఆరు గజాల 'బాలంగిరి' ఇల్లు - ఎకురం ఎవుసం ఉన్న మేనత్త కొడుకు భూమ య్యకు తనను 'ఇయ్య'నని తండ్రి అన్నా - పుట్టినప్పటి నుండీ భార్యా భర్తల భావంతోని పెరిగిన భూలక్ష్మి మొండిగా పట్టుబట్టి భూమయ్యనే పెళ్లి చేసుకుంది. 'నిజంగానె భూమయ్య ఎడ్డోడే - పుట్టి అమాయకుడే - ఉన్న పొలంల రెక్కలు ముక్కలు సేసుకునుడు - రోజూ బర్లకు మాలేసుగ రెండు మోపుల వచ్చిగడ్డి కోసుక చ్చుడు - పావులో, ఆఠాణో అప్పుడప్పుడు ఇస్తేనే బీడీ కొనుక్కొని తాగుడు - బీడీలు లేకుంటే ఎన్నడూ నోరిడిసి పైసలు కావా ల్నని అడుగడు - తనే సూసి బయ్యాలె - లేకుంటే లేదు. చెప్పింది కాదనకుంట సేసుకుపోవుడే ఆయన పని - ఎన్నడన్న తను కోపానికత్తె సిన్న పోరగాండ్ల తీర్గ మొకం సిన్నగ సేసుకుంటడు - పాపం తెల్లారిందని లేపిన భర్తను అపార్థం చేసు కొని 'సిర్రన' కోపానికి వచ్చినందుకు భూల క్ష్మి మనసును బాధ బర్మా తొలుస్తున్నట్లుగా ఉంది.

పిల్లగాడు నిద్రపోతూ ఇంకా జాము సేపైనా పాలు 'గుట్ట గుట్ట' తాగుతూనే ఉన్నాడు. భూమయ్య 'సర్వ'ల పాలు పిండుతున్న శబ్దం 'జుయ్యి జుయ్యి'మని వినిపిస్తూనే ఉంది. రెండు రొమ్ములల్ల పాలు అయిపోయినా పిల్లగాడు రాని పాల కోసం ప్రయత్నం చేస్తున్నాడు - ఒక్కసారి మంట మండే సరికి 'దుడ్డె కొక్కోలె ఎంత సీకినా పోరనికి ఇరాం లేదు. ఎంత సేపైనా కడుపు నిండదు'' అని భూలక్ష్మి విను క్కుంటూ పిల్లగాని నోట్లోని రొమ్మును సుత రంగా తీసింది - పిల్లగాడు నిద్రపోతూనే మెనులుతుండే సరికి - అంతసేపు విను క్కున్న భూలక్ష్మి ఇద్దరు ఆడపిల్లల తరు వాత కొడుకు పుట్టాడనే విషయం గుర్తుకొ చ్చి గారాబంగా 'మనమేమన్న పున్నోల్లమా బిడ్డా! నిన్ను ఏడ్వనియ్యకుంట సాదడాన్కి. పనిసేత్తె కడుపు నిండుతుంది - సెయ్య కుంటే ఎండుతది'' చ్చొ, చ్చొ అంటూ జోకొట్టి పడుకోబెట్టింది.



రాజు: నీవు సొంతంగా కవిత రాసి పంపిస్తే 'సేకరణ' అని నీ పేరు ప్రచురించారేమిట్రా?
రంగ: అదే పత్రికకి ఇంతకు ముందు కొన్ని రచనలు సేకరించి పంపాను. ఇప్పుడు నా సొంత కవిత కూడా అదే బాపతు అనుకొని ఉంటారు.

కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం
కరీంనగర్

పెద్ద బిడ్డ చలికి ముడుసుకు పడు కుంది. రాత్రంతా జెరమచ్చిన చిన్నపిల్ల తెల్లారె ముందు జారేసరికి 'సోయి సుద్ది' లేక మాంచి నిద్రలో వుంది. ముగ్గురు పిల్లలకు బట్టలు సరిగ్గా కప్పి భూలక్ష్మి 'ఇంటెనుకకు' నడిసింది. చల్లగా నరాలు జివ్వున లాగినా గోళెంల నీళ్ళు రెండు పురిసెలన్ని నోట్లో పోసి పుక్కిలించి వూంచింది - వంటింట్లకు వచ్చి జారట్ల బోళ్ళేసి పొయ్యిల బూడిద ఎత్తిపోసి ఊడ్చి సన్నగా అలికి ముగ్గేసింది.

ఇంకాస్సేపటికి తెల్లారుతుందన్నట్లు చు టువక్కల బాయిలమీద బొక్కెన్ల చప్పుడు, దూరంగా వున్న బోరింగ్ దన్ దన్ మని కిందికి మీదికి కొడుతున్న శబ్దం వినిపిస్తు న్నాయి. ఇండ్లళ్ళ పాడి పశువులు పాలు ఇయ్యక పోయేసరికి ''అగో నీకు గత్తర రాను ఏమైందె ... ఓ... హెూ....'' అటూ రైతులు ప్రేమగా తిడుతూ 'మచ్చ' కొడుతు న్న మాటలు ఊరి గాలిలో కలగాపులగంగా తేలి ఆడుతున్నాయి.

భూమయ్య పాలు పిండుక వచ్చి పది లంగా పెద్ద సర్వను ఉట్టి మీద పెట్టి భూ లక్ష్మి కోసం కళ్ళతోనే వెతుకుతున్నాడు.

భూ లక్ష్మి జారట్ల 'దబ్బ దబ్బ' పండ్లు తోమి మొకం కడిగి కొంగుతోని తుడుసు కుంట లోపలికి వచ్చింది.

''దీనియవ్వ - కరెంటు ఎలుగులకు రాత్రి వుంది తెలుత్తలేదు - తెల్లారుతుంది ఎరుకైతలేదు - గిప్పుడే పిట్టలు పిస పిస మనవట్టే'' అంటూ భూమయ్య సిరిసిల్లకు పోవడానికి 'పొద్దు పోతుంద'నే విషయం భార్యకు చెప్పకనే చెప్పాడు.

భూలక్ష్మి 'జెప్ప జెప్ప' రాత్రి కడిగి పెట్టిన సేరు చెంబులను, మూడుసేర్ల టిఫిన్ డబ్బను తీసి పాలల్ల నీళ్ళు కలిపి నింపింది. భూలక్ష్మి పాల చెంబులను ఒక్క టొక్కటి అందిస్తుంటే భూమయ్య కదల కుండా తొణకకుండా చూసి గంపల ఒక్కటొ క్కటి పేర్చాడు.

''ఓ భూ లచ్చక్కా! సిరిసిల్లకు వత్తనని పొంగ పిలువుమంటివి గదా! రా! మరి తయారైనవా లేదా?'' అని కుమ్మరోల్ల రాజ వ్వ వదినె పాలగంప నెత్తిల పెట్టుకొనే బజార్ల నుంచి పిలిచింది.

''రాజవ్వ అదినె! ఆగాగు. తయారైన - వత్తున్న జెర నిలబడు'' భూలక్ష్మి లోపలి నుండే పలికింది.

''ఓ పెద్ద పోరి! ఏం మొద్దు నిద్రనె. నీకు ఎప్పటికి నిద్ర దయ్యమే తెట్టన్ తెల్లారింది జెర లెవ్వే! లేసి ఆకలి నూక సాన్పు సల్లు - జారట్లున్న బోళ్ళకు బూడిది రాయి - అవ్వా! లతవ్వ! (? సెల్లెకు జెరమ చ్చి గడికోసారి మూలుగుతంది - బిడ్డా! దాన్ని లేపకు. కొట్టకు. జెర సేపు పండని య్యి.

సెల్లెకు లేసినంక గిలాసల కొన్ని పాలుంచిన. పెద్దవ్వను కాగపెట్టి పొయ్యిమ న్న. తమ్ముడు గిప్పుడు లెవ్వడుగని లేత్తే ఆడిపియ్యి - బాగ ఏడిత్తె కూసోని మెల్లగ ఎత్తుకో మెడలు పదిలం బిడ్డా! నీకేమన్నా కొనుక్కత్త - ''భూలక్ష్మి కోప్పడుతూ లేపు తూనే 'బుదగరిస్తూ' సిరిసిల్ల నుండి వచ్చే వరకూ తొమ్మిదేళ్ళ పెద్ద బిడ్డకు ఇంటి బాధ్యతలు అప్పగించింది. పొయ్యే తొంద రలో మరసిపోతనని మొన్న ఎదిరి చూ డంగా పుట్టిన కొడుకు ఇరవై ఒక్క దినానికి కోమటాయన దగ్గర బాకీ తెచ్చిన అయిదు వందల నుండి ఖర్చు చేయగా మిగిలిన ఇరవై రూపాయలనూ, చిన్నపిల్ల మందుల చిట్టీని 'చెక్కుడు సంచి'లో పెట్టుకొని భూల క్ష్మి రొండికి చెక్కుకొంది.

'బిల బిల' చలి పెడుతుంది - ఆ వయసు పిల్లలు లేచే సమయం కాకున్నా - 'రాంగ ఏమన్న కొనుక్కత్త' తల్లి అనేసరికి పెద్ద బిడ్డ లత గునుస్తూనే నిద్రలేచి వాకిలి ఊడ్వడానికి మూలకున్న చీపురుకోసం నడి చింది.

భూలక్ష్మి 'చుట్ట బట్ట' చేసుకొని నెత్తి మీది పెట్టుకొని ఇవతల నిలబడింది. భూ మయ్య పాలగంప లోపలినుండి తీసుకవ చ్చి ఎత్తాడు. పాల టిఫిన్ తెచ్చి చేతికి అందించాడు. భూమయ్య బర్లను ఇడిసి ముందటేసుకొని పొలంవైపు నడిచాడు.

''ఏమాయెనో! జాడ్యం సెయ్యవడితివి - మబ్బుల లేసిన పని బొడ్డురొతు కాడ తెల్లారినట్టు గిక్కడనే గియ్యాల్లాయె - నడు నడు'' అని కుమ్మరోల్ల రాజవ్వ తొందర చేసింది.

''ఆ! వత్తనే వుంటి అదినే! కొత్త పెండ్లి పిల్ల కొంగు లెక్క ఆగుతనే లెవ్వు. మా అన్న జెల్దిని రమ్మని సెవుల ఏమన్నా ముచ్చట సెప్పిండా ఏంది ఏగిర్త పడవడితివి'' భూ లక్ష్మి నొయ్యకుంట సమాధాన చెప్పింది.

''మీ అన్నను సేసుకొని గీ కొంపల సెవుల గోపమొక్కటే తక్కువాయె! రాత్రి ఎక్కడో రెండు పొట్లాల సార తాగి ఇంకా 'గుర్రు' పెడుతూనే ఉన్నడు'' అని కుమ్మరో ల్ల రాజవ్వ అంది.

రాత్రంతా గడ్డిమీద కురిసిన మంచు 'సల్లగ' కాళ్ళకు తాకి తిమ్మిరి పట్టింది - అయినా భూలక్ష్మి, రాజవ్వ ఆ ముచ్చట ఈ ముచ్చట పెట్టుకుంటూనే ఎండిపోయిన చంద్రవంక వాగుదాటి సిరిసిల్ల రోడ్డు వరకు వచ్చారు.

## గణితంలో గమ్మత్తు

మీ వయస్సు, జేబులో డబ్బు ఎంత? మీ స్నేహితుని కొన్ని ప్రశ్నలు వేసి అతని వయస్సు, జేబులో చిల్లర చెప్పవచ్చు.

మీ స్నేహితుని వయస్సును 2 చే గుణించి 5 కలపమని చెప్పండి. వచ్చిన లబ్ధమును 50 చే గుణించి అతని జేబు లోని చిల్లర కలపమని చెప్పండి. మొత్తము నుండి 365 తీసివేయమని చెప్పండి. మొ త్తము ఎంతో అడగండి. మొత్తమునకు 115 కలపండి. వేలు వందలు స్థానములోని సంఖ్య మీ స్నేహితుని వయస్సు అగును. పదులు ఒకట్ల స్థానములోని సంఖ్య మీ స్నేహితుని జేబులోని చిల్లరఅవుతుంది.

ఉదాహరణకు మీ స్నేహితుని వయస్సు 44 సంలు చిల్లర 60 పైసలు అనుకోండి.

44 ను 2 చే గుణించగా 88 వస్తుంది. దీనికి 5 కలువగా 93 వస్తుంది దీనిని 50 చే గుణించగా 4650 వస్తుంది దీనికి మీ స్నేహితుని జేబులోని చిల్లర 60 పైసలు కలువగా 4710 అవుతుంది. దీనినుండి 365 తీసివేయగా 4345 వచ్చును. దీనికి 115 కలువగ 4460 అవుతుంది. వేలు, వందల స్థానము మీ స్నేహితుని వయస్సును పదు లు, ఒకట్ల స్థానం 60 మీ స్నేహితుని జేబులోని చిల్లర డబ్బు అవుతుంది

మీ స్నేహితుని వయస్సు 44 సం॥
జేబులోని చిల్లర 60 పైసలు.

-జి. అరుణ

